సాక్షి సూర్యాపేట

ఆదివారం : 22 : జనవరి : 2023



ఆత్మహత్యాయత్నం

విధుల నుంచి తొలగించారన్న మనస్తాపంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కంకణా ఉప ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. - 10లో



వెంకిర్యాలలో త్రిపుర బృందం

త్రిపురకు చెందిన టీఆర్ఎల్ఎం బృందం శుక్రవారం బీబీనగర్ మండలంలో వెంకిర్యాలలో పర్యటించింది. - 10లో



వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆహ్లాదంగా, రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట టౌన్: మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6నుంచి 10వ తరగతుల్లో అడ్మిషన్ కావాలనుకునే అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఫిబ్రవరి 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పరీక్ష ఫీజు ఓసీ విద్యార్థులకు రూ.200, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.125 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 16న నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బదిలీల్లో అవకాశం కల్పించాలి

సూర్యాపేట టౌన్: జీఓ 317 ద్వారా స్థానికత కోల్పోయి వేరే జిల్లాలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు జీరో సర్వీస్‌తో వారి పాత స్టేషన్‌ని కూడా పరిగణనలోకి తీసుకొని బదిలీల్లో అవకాశం కల్పించి న్యాయం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతం సంధ్యారాణి, యామా రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు లాంగ్ స్టాండింగ్ సర్వీస్‌ను ఐదు సంవత్సరాలు మాత్రమే ఉండేలా బదిలీల జీఓను విడుదల చేయాలని కోరారు. పండిట్లు, పీఈటీలను ఉన్నతీకరణ చేపట్టాలని, బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా జరిగేలా చూడాలని ప్రభుత్వానికి విన్నవించారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలని, జీపీఎఫ్, టీఎస్జీఎల్ఐ రుణాలను అనుమతించాలని పేర్కొన్నారు. పెండింగ్ మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను తక్షణమే పరిష్కరించాలని, ఏడు నెలల పీఆర్‌సీ ఏరియర్స్, సీపీఎస్ ఏరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు.

26న రైతుల నిరసన ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వర్‌రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఈనెల 26న రైతులు ట్రాక్టర్లు, వాహనాలతో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొప్పోజు సూర్యనారాయణ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దండ వెంకటరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ధర్మభిక్షం భవన్‌లో కంబాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సంయుక్త కిసాన్ మోర్చా సన్నాక సమావేశంలో వారు మాట్లాడారు. గత సంవత్సరం జనవరి 26న శాంతియుతంగా ఢిల్లీలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తున్న సందర్భంగా లాఠీచార్జి చేసి, బాష్ప వాయువు ప్రయోగించి రైతులను చిత్రహింసలక గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు బుద్ధ సత్యనారాయణ, వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వరికుప్పల వెంకన్న, బహుజన కూలీ సంఘం జిల్లా కార్యదర్శి చామకూరి నరసయ్య, ఏఐపీకేఎస్ జిల్లా నాయకుడు రామోజీ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, రైతు సంఘం నాయకులు శంకర్ రెడ్డి, ఎస్‌కే నజీర్, కునుకుంట్ల సైదులు, చిట్టి బాబు, జీవన్ కుమార్, గోపగాని రవి పాల్గొన్నారు.

నేడు పెద్దగట్టులో దిష్టి పూజ

- కేసారం గ్రామానికి చేరిన దేవరపెట్టె
- ఆదివారం అర్ధరాత్రి వరకు లింగమంతులస్వామి ఆలయానికి తరలింపు
- అదేరోజు బలిహరణ



కేసారం తీసుకెళ్తున్న దేవరపెట్టెకు సూర్యాపేట జిల్లా కేంద్రంలో స్వాగతం పలుకుతున్న వట్టె జానయ్యయాదవ్ తదితరులు



చివ్వెంల(సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్దదైన శ్రీ లింగమంతుల స్వామి (పెద్ద గట్టు) జాతర ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 9 వరకు జరగనుంది. ఈ నేపథ్యంలో నేడు (ఆదివారం) దిష్టి పూజామహోత్సవాన్ని నిర్వహించనున్నారు. దేవతా మూర్తులతో కూడిన దేవరపెట్టెను మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం చీకటాయపాలెం గ్రామం నుంచి ఊరేగింపుగా సూర్యాపేట మండలం కేసారం గ్రామానికి శనివారం రాత్రి తీసుకొచ్చారు. ఆదివారం అక్కడ దేవతకు బైకాసులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదేరోజు గ్రామానికి చెందిన మెంతబోయిన, తండ, మట్ట వంశీయుల సమక్షంలో దేవరపెట్టెను ఊరేగింపుగా తీసుకెళ్తారు. గజ్జెల లాగుల గలగలలు, భేరీ చప్పుళ్లు, ఓ లింగా.. ఓ లింగా నామస్మరణల మధ్య గ్రామం నుంచి 9 కిలో మీటర్ల దూరంలో ఉన్న పెద్దగట్టుకు అర్ధరాత్రి వరకు దేవరపెట్టె చేరుకుంటుంది.

గుట్ట చుట్టూ బలిహరణ

లింగమంతుల స్వామి జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కగలకుండా ఉండేందుకు దిష్టిపూజ కార్యక్రమంలో భాగంగా తల్లి, పిల్ల గొర్రెలను స్వామి వారికి బలి ఇస్తారు. అనంతరం భక్తులు తీసుకుచ్చిన నైవేద్యంతో రక్తంను కలిపి గుట్ట చుట్టూ బలిహరణ కార్యక్రమం నిర్వహిస్తారు. బలి ఇచ్చిన తల్లి, పిల్ల గొర్రె మాంసంతో వండిన ఆహారాన్ని సోమవారం భక్తులకు వడ్డించనున్నారు. దీంతో దిష్టి పూజ కార్యక్రమం ముగిసినట్లుగా ప్రకటిస్తారు. అదే రోజు సాయంత్రం దేవర పెట్టెను కేసారం గ్రామానికి తరలిస్తారు. జాతర ప్రారంభం రోజున మళ్లీ దేవర పెట్టెను పెద్దగట్టుకు తీసుకొస్తారు.



పెదగట్టు శ్రీ లింగమంతులస్వామి ఆలయం

దేవరపెట్టెకు ఘన స్వాగతం

చీకటాయపాలెం నుంచి ఊరేగింపుగా కేసారం తీసుకెళ్తున్న దేవరపెట్టెకు శనివారం రాత్రి సూర్యాపేటలో డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, శ్రీకృష్ణ యాదవ కమిటీ ట్రస్ట్ చైర్మన్ ఊర రామ్మూర్తి యాదవ్, తండు శ్రీనివాస్‌యాదవ్ స్వాగతం పలికారు. కేసారం గ్రామానికి చేరగానే మెంతబోయిన వంశస్తులు స్వాగతం పలికారు. దేవరపెట్టెను స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఉంచారు.

భారీ పోలీస్ బందోబస్తు

దిష్టి పూజ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు. డీఎస్పీ, ఇద్దరు సీఐలు, 11ఎస్ఐలు, 34మంది ఏఎస్ఐలు,37 మంది కానిస్టేబుళ్లు, 29మంది హోంగార్డులు బందోబస్తు విధుల్లో పాల్గొననున్నట్లు ఆయన వివరించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో దిష్టి పూజ వేడుకలు జరుపుకోవాలని సూచించారు.



శ్రీ లింగమంతులస్వామి, ఆకుమంచమ్మ, మాణిక్యమ్మ విగ్రహాలు



పూలమాలలతో అలంకరించిన చౌడమ్మ, గంగమ్మ, యలమంచమ్మ విగ్రహాలు

నాలుగు మండలాల్లో మిర్చి కొనుగోలు కేంద్రాలు

- కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో నూతనకల్, చింతలపాలెం, మోతె, చివ్వెంల నాలుగు మండలాల్లో ఎండు మిర్చి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ వెల్లడించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తేజ మిర్చి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో ఆయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం మిర్చి కొనుగోలు చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామ మహిళా ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ద్వారా మిర్చి కొనుగోళ్లు చేపట్టాలని, మిర్చి రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలని, వీటి ద్వారా మహిళా ఉత్పత్తిదారులకు కూడా లబ్ధి చేకూరుతుందన్నారు. జిల్లాలోని 45 గ్రామ పంచాయతీల్లో 1,397మంది రైతులు 2,140 ఎకరాల్లో రెడ్ చిల్లీ వేశారని, సుమారుగా 42 వేల క్వింటాళ్ల రెడ్ చిల్లీ ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, ప్లాంట్ లిపిడ్ అధికారి మహేష్, డీఏఓ రామారావు నాయక్, ఏపీఎంలు, డీపీఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

కంటి వెలుగుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో కంటి వెలుగు శిబిరాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ తెలిపారు. కంటి వెలుగు నిర్వహణపై శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌లో కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ పాల్గొని జిల్లాలో కంటి వెలుగు అమలు తీరును వివరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా క్వాలిటీ కంట్రోల్ బృందాలు విస్తృతంగా కంటి వెలుగు క్యాంపులను పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. ఆ బృందాల ఫీడ్ బ్యాక్ తీసుకుని మరింత మెరుగ్గా కంటి వెలుగు శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కంటి వెలుగు క్యాంపు నిర్వహణ సమయంలో పక్కాగా వివరాలు ట్యాబ్‌లలో నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం, డిప్యూటీ డీఎంహెచ్ఓ హర్షవర్ధన్, డీపీఓ యాదయ్య పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, డీఎంహెచ్ఓ

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

భానుపురి(సూర్యాపేట): గిరిజనులు ఆరాధ్యదైవంగా భావించే సేవాలాల్ మహారాజ్ జయంతిని తెలంగాణ ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని లంబాడీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్ బాలునాయక్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బానోతు హరీష్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్క తండా, గ్రామ పంచాయతీల్లో సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో లంబాడీ విద్యార్థి సేన సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ నాయక్, సేవలాల్ నాయక్, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలునాయక్

కార్మికులంతా సంఘటితం కావాలి

- డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్

భానుపురి(సూర్యాపేట): ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ టెక్నీషియన్ కార్మికులు సంఘటితంగా ఉండాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని జీవీవీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సూర్యాపేట ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ టెక్నీషియన్ యూనియన్ చతుర్ధ వార్షికోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. ఏ ఒక్క కార్మికునికి కష్టం వచ్చినా ముందుగా సంఘం నాయకునికి తెలియజేయాలని కోరారు. కార్మికుల పక్షపాతి అయిన విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. త్వరలోనే మంత్రి దృష్టికి తీసుకెళ్లి సంఘం భవనం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రతి ఒక్క కార్మికుడు సంఘం సభ్యత్వం తప్పనిసరిగా తీసుకోవాలని, సభ్యత్వం తీసుకోవడం ద్వారా చాలా ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్టా కిశోర్, కోఆప్షన్ సభ్యురాలు స్వరూపరాణి, యూనియన్ పట్టణ అధ్యక్షుడు బొమ్మగాని వెంకన్న, రాచకొండ జానయ్య, రవి, శ్రీనివాస్, వెంకటేష్, కడారి రాము, పిట్ట లింగయ్య, చీకూరి లక్ష్మణ్, అహ్మద్, బానోతు రమణ, అజ్మత్, కుర్ర నర్సయయ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వట్టె జానయ్యయాదవ్

యాదాద్రిలో నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి క్షేత్రంలో శనివారం నిత్యారాధనలు కొనసాగాయి. స్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, కుంకుమార్చన చేపట్టారు. ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం , బ్రహ్మోత్సవం, జోడు సేవ నిర్వహించారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీసమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అత్యంత వైభవంగా అర్చకులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో . ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిదంగా నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని రమ్యంగా రక్తికట్టించారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరనం , మధుపర్క పూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేదమంత్రోచ్ఛరణలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, నవీన్, లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు , లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.



మట్టపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మహిళలకు ఆర్థిక భరోసా

- కొత్తగా 845 స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు
- రూ. 12.67కోట్ల రివాల్వింగ్ ఫండ్ మంజూరు
- ఒక్కొక్క సంఘం ఖాతాలో రూ. 15 వేల చొప్పున జమ
- ఇప్పటి వరకు 318 సంఘాలకు అందిన నిధులు



బ్యాంకు లింకేజీ రుణాలపై మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిలుకూరు: పద్దెనిమిదేళ్లు నిండిన మహిళలందరూ స్వయం సహాయక సంఘాల్లో ఉండాలనే లక్ష్యంతో 2022 జనవరి, ఫిబ్రవరి నెలల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నూతన సంఘాలను ఏర్పాటు చేశారు. ఇందులోని మహిళల్లో ఉత్సాహం నింపి ఆర్థికంగా ప్రోత్సహించడానికి జాతీయ గ్రామీణ జీవనోపాదుల సంస్థ (ఎన్ఆర్ఎల్ఎమ్) ప్రత్యేకంగా ఉచితంగా రివాల్వింగ్ ఫండ్ అందిస్తోంది. డిసెంబర్ మాసం చివర్లో నిధులు మంజూరు కాగా ప్రస్తుతం కొత్త పొదుపు సంఘాల్లో అధికారులు జమ చేస్తున్నారు.

మొత్తం 18,797 సంఘాలు

జిల్లా వ్యాప్తంగా పాత మహిళా సంఘాలు 17,952, కొత్తవి 845 కలిపి 18,797 పొదుపు సంఘాలు ఉన్నాయి. వీఏఓ, సీసీ, ఏపీఎంలు గ్రామాల్లో పర్యటించి 18 ఏళ్లు నిండిన వారితో గతేడాది నూతనంగా 845 సంఘాలు ఏర్పాటు చేశారు. ఒక్కో కొత్త సంఘంలో పది మంది చొప్పున 8,450 మంది సభ్యులు ఉన్నారు. వీరు ప్రతి నెలా రూ. 100 లేదా రూ. 200 చొప్పున డబ్బులు జమ చేస్తారు. అయితే ఇప్పటికిప్పుడు వారు ఆర్థిక అవసరాలు తీర్చేందుకునేందుకు , ఏదైనా వ్యాపార ప్రోత్సాహకానికి డబ్బు అందని పరిస్థితి ఉంటుంది. దీనిని గుర్తించిన సెర్ప్ ప్రోత్సాహకంగా రివాల్వింగ్ ఫండ్ అందించింది. ఒక్కో సంఘానికి రూ. 15 వేల చొప్పున 845 సంఘాలకు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు 318 సంఘాల ఖాతాల్లో రూ. 15 వేల చొప్పున జమ చేశారు. దీంతో మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

మహిళలకు ప్రోత్సాహకంగా..



కొత్తగా ఏర్పాటైన సంఘాల మహిళలకు ప్రోత్సాహకంగా ఉండేందుకు వారి ఆర్థిక పరిస్థితి మెరుగు పరిచేందుకు రివాల్వింగ్ ఫండ్ అందిస్తున్నాం. ఇప్పటికే ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. ఈ ఏడాది కూడా కొత్త సంఘాల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుంది. అర్హత కలిగిన సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మార్చి నాటికి టార్గెట్ పూర్తవుతుంది.

– సుందరి కిరణ్‌కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

బ్యాంకు లింకేజీ రుణాలు సైతం..

పొదుపు సంఘాలకు ఏటా బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందజేస్తున్నారు. ఈ ఏడాది కూడా జిల్లాలోని 18,797 పొదుపు సంఘాలకు రూ. 715 కోట్లు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటిలో ఇప్పటి వరకు ఉన్న సంఘాల్లో 15,696 సంఘాలకు రూ. 498కోట్లు మంజూరు చేశారు. మిగిలిన సంఘాలకు ఈ ఏడాది మార్చి నాటి కల్లా పూర్తి మంజూరు చేయనున్నారు. ఈ రుణాలతో వారంతా వ్యాపారం అభివృద్ధి చేసుకొని, ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఆస్కారం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సిద్ధమవుతున్న టీచర్ల జాబితాలు

- బదిలీలు, పదోన్నతులకు కసరత్తు
- మండల స్థాయిలో ఉపాధ్యాయుల వివరాలు సేకరిస్తున్న ఎంఈఓలు
- ఒకేచోట ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న వారికి తప్పని స్థాన చలనం
- ఐదేళ్లు పూర్తి చేసుకున్న జీహెచ్ఎంలకు సైతం..



సూర్యాపేట టౌన్: ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టేందుకు విద్యాశాఖ జాబితాలు సిద్ధం చేస్తోంది. పూర్తి మార్గదర్శకాలు రానప్పటికీ జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్ల జాబితాలను తయారు చేసే పనిలో మండల స్థాయి అధికారులు నిమగ్నమయ్యారు. ఉపాధ్యాయ ఖాళీలు, పదోన్నతుల కోసం అర్హులైన టీచర్ల జాబితాలను సైతం ఎంఈఓలు సిద్ధం చేసి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపే పనిలో ఉన్నారు. ఒకే పాఠశాలలో ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న టీచర్లు, ఐదేళ్లు పూర్తి చేసుకున్న జీహెచ్ఎంలకు తప్పనిసరిగా బదిలీ ఉండే అవకాశం ఉంది. ఎంఈఓలు మండలాల వారీగా కనీస సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయుల జాబి తాలను కూడా సిద్ధం చేస్తున్నారు. ఒకే బడిలో కనీస సర్వీసు పూర్తి చేసుకున్న టీచర్ల స్థానాలను కూడా ఖాళీగా చూపనున్నారు. జిల్లాలోని 23 మండలాల్లో ఎంఈఓలు గురువారం నుంచి వారి పరిధిలోని అన్ని పాఠశాలల నుంచి సమాచారం తెప్పించుకొని జాబితాలు తయారు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు.

పారదర్శకంగా..

బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. అధికారికంగా మార్గదర్శకాలకు సంబంధించి షెడ్యూల్ విడుదల కాలేదు. ఉపాధ్యాయులకు మొదట బదిలీలు చేపట్టి తర్వాత పదోన్నతులు కల్పించనున్నట్లు సమాచారం. జీహెచ్ంలకు మొదట బదిలీలు చేసి మిగిలిన ఖాళీలను స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ)లకు సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించడం ద్వారా భర్తీ చేస్తారు. ఆ తర్వాత ఎస్ఏలకు బదిలీలు చేసి మిగిలిన ఖాళీలను ఆయా సబ్జెక్టుల్లో అర్హులైన ఎస్జీటీలకు పదోన్నతులు కల్పిస్తారు. విభాగాల వారీగా బదిలీలు, పదోన్నతులను వరుస క్రమంలో పూర్తి చేయనున్నారు.

షెడ్యూల్ రాగానే వివరాలు ప్రకటిస్తాం

జిల్లాలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మండలాల వారీగా ఖాళీల వివరాలు, కనీస సర్వీసు ఒకే పాఠశాలలో పూర్తి చేసుకున్న ఉపాధ్యాయుల జాబితాలు తెప్పిస్తున్నాం. అన్ని మండలాల నుంచి వివరాలు అందగానే జిల్లా స్థాయిలో పదోన్నతుల కోసం ఉపాధ్యాయుల సీనియారిటీ జాబి తాలు రూపొందిస్తాం. షెడ్యూల్ రాగానే ఉపాధ్యాయుల ఖాళీలు, సీనియారిటీ వివరాలు ప్రకటిస్తాం.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

సబ్జెక్టుల వారీగా ఖాళీలు ఇవే..

జిల్లాలో మొత్తం 4,255 మంది ఉపాధ్యాయులకు గాను 3,614 మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇంకా 641 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జీహెచ్ఎం 106, పీఎస్‌హెచ్ఎం 111, ఎస్ఏ(తెలుగు) 40, ఎస్ఏ(హిందీ) 28, ఎస్ఏ(ఇంగ్లిష్) 32, ఎస్ఏ(మ్యాథ్స్) 15, ఎస్ఏ(ఫిజిక్స్) 9, ఎస్ఏ ఫిజికల్ సైన్స్ (ఉర్దూ) 1, ఎస్ఏ (బయోసైన్స్) 54, ఎస్ఏ బయోసైన్స్ (ఉర్దూ) 1, ఎస్ఏ సోషల్ 89, ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ 5, ఎల్‌పీటీ 7, ఎల్‌పీహెచ్ 10, పీఈటీ 2, ఎస్జీటీ(తెలుగు) 118, ఎస్జీటీ(ఉర్దూ) 12 చొప్పున ఖాళీలు ఉన్నాయి. వీటిలో 70శాతం ఖాళీలను సీనియారిటీ ప్రాతిపదికన అర్హులైన ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించి భర్తీ చేస్తారు. మిగిలిన 30శాతం పోస్టులను నేరుగా నియామకాల ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది. ఎస్జీటీల ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది.

తపస్ డైరీని ఆవిష్కరించిన డీఈఓ

భువనగిరి : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన డైరీని శనివారం డీఈఓ నారాయణరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షురాలు రేపాక ఉమ, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర క్రీడా కో కన్వీనర్ శ్రీధర్, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జైని వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ఫిబ్రవరి నుంచి కందులు కొనుగోలు చేయాలి

భువనగిరిటౌన్ : ఫిబ్రవరి మొదటి వారం నుంచి జిల్లాలో 3 కేంద్రాల ద్వారా కందులు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం తన చాంబర్‌లో కందుల కొనుగోలుపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచి కందుల మార్కెట్లోకి రావడం జరుగుతుందని, జిల్లాలో మోత్కూర్, ఆలేరు, భువనగిరి వ్యవసాయ మార్కెట్ల ద్వారా కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. మార్కెట్ సొసైటీల సిబ్బందికి కొనుగోలు సంబంధించి మార్క్‌ఫెడ్ వారు శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లాలో 1077 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిందని, క్వింటాలుకు రూ. 6,600 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు నాణ్యతా ప్రమాణాలతో కందులు తీసుకురావాలని కోరారు. సమీక్షలో జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికి కాంగ్రెస్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలే లక్ష్యంగా కార్యాచరణ
- 26న హాత్ సే హాత్ జోడోయాత్ర ప్రారంభంతో కార్యక్రమాలు
- జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ జెండా ఆవిష్కరణలు
- ఫిబ్రవరి 6న ఖమ్మంలో బహిరంగ సభ
- ఆ తర్వాత రాహుల్ సందేశం చేరవేయనున్న పార్టీ శ్రేణులు


జోడో యాత్ర సన్నాహక సమావేశానికి రేవంత్‌రెడ్డితోపాటు వెళ్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమైంది. ఈనెల 26 నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రారంభించబోతున్నారు. ఇందులో భాగంగా నల్లగొండ ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మున్సిపాలిటీలు, మండలాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం పెంపొందించాలని నిర్ణయించింది. మరోవైపు ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసేలా కార్యాచరణకు జిల్లా పార్టీ నేతలు సిద్ధం అవుతున్నారు.

సన్నాహక సమావేశంలో నిర్ణయం మేరకు..

హాత్ సే హాత్ జోడో యాత్ర సన్నాహక సమావేశం శనివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగింది. 26 నుంచి యాత్రతోపాటు ఫిబ్రవరి 6వ తేదీన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏదో ఒక చోట భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో సభకు నల్లగొండ జిల్లా నుంచి కూడా భారీఎత్తున జనాలను సమీకరించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కాంగ్రెస్ నేతలు నిర్ణయించారు. హైదరాబాద్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో నల్లగొండ జిల్లాకు చెందిన ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాత్ సే హాత్ జోడో యాత్ర విజయవంతానికి, జెండాల ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లాలో చేయాల్సిన ఏర్పాట్లపై ఎంపీతో డీసీసీ అధ్యక్షుడు చర్చించారు.

జోడో యాత్రతో పెరిగిన ఉత్సాహం



రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. జోడో యాత్రకు వస్తున్న ఆదరణతో నాయకులు కార్యకర్తలు చురుగ్గా కనిపిస్తున్నారు. జోడో యాత్ర సందర్భంగా దేశంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల నుంచి తెలుసుకొని జోడో యాత్రలో సందేశాలు ఇచ్చారు. ఆ సందేశాలను అన్నింటిని ప్రజల్లోకి ఇప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.

7 నుంచి ఇంటింటికి రాహుల్ సందేశం

ఫిబ్రవరి 6వ తేదీన నిర్వహించనున్న బహిరంగ సభ తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో ఇంటింటికి రాహుల్ సందేశం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని కాంగ్రెస్ కార్యకర్తలంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలనలో ఎలా విఫలమయ్యాయనే విషయాలతోపాటు వారి పాలనలో ప్రజలపై మోపిన భారాలు, ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలు తదితర సందేశాలను ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేసి, ప్రజలను చైతన్యపరిచేలా కార్యక్రమాలను నిర్వహించేలా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది.

భక్తులకు ఇబ్బంది కలగొద్దు

- అధికారులు బాధ్యతతో పనిచేయాలి
- చెర్వుగట్టు బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన నల్లగొండ కలెక్టర్


బ్రహ్మోత్సవాల పనులను పరిశీలిస్తున్న నల్లగొండ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నార్కట్‌పల్లి : బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రతి అధికారి బాధ్యతతో పని చేయాలని నల్లగొండ కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. మండలంలోని చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆలయం వద్ద చేపట్టిన పనులను శనివారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, ఆర్డీఓ జయచంద్రారెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. గట్టుపైన కల్యాణ మండపం, కోనేరు, టాయిలెట్స్, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తారని వారికి ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా తాగునీరు సరఫరా చేయాలని చెప్పారు. కొండపైన, కింద ఉన్న టాయిలెట్స్‌కు డోర్లు ఏర్పాటు చేసి, రన్నింగ్ వాటర్ సరఫరా అయ్యేలా చూడాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో తగినంత సిబ్బందిని నియమించి పారిశుద్ధ్య నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. బ్రహ్మోత్సవాల గురించి అన్ని ప్రాంతాల్లో ప్రచారం చేయాలని దేవాలయ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ నర్సింహారెడ్డి, డీపీఓ విష్ణువర్ధన్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీపీఆర్ఓ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ముజీబుద్దీన్, దేవాలయ శాఖ ఏసీ మహేంద్ర కుమార్, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, సర్పంచ్ మల్ల బాలకృష్ణ, తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ యాదగిరి, ఎస్ఐ రామకృష్ణ, సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి తదితరులు ఉన్నారు.

నెలరోజుల్లో సమస్యలు పరిష్కరిస్తాం


డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, కోదాడ ఎమ్మెల్యే తదితరులు

- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

అనంతగిరి: అనంతగిరి మండలం వెంకట్రామాపురం గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను నెలరోజుల్లో పరిష్కరిస్తామని సూర్యాపేట కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ హామీ ఇచ్చారు. అనంతగిరి మండలం వెంకట్రామాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కోదాడ మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్‌ను శనివారం వారు పరిశీలించారు. కొన్ని సంవత్సరాలుగా డంపింగ్‌యార్డ్ వ్యర్థాలతో వెంకట్రామాపురం గ్రామ ప్రజలు వ్యాధుల బారిన పడడంతో పాటు భూగర్భజలాలు, వాయు కలుష్యం జరుగుతున్నాయంటూ ధర్నాలు చేపట్టడంతో సమస్యలను స్వయంగా పరిశీలించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చెత్త ఎక్కువగా పేరుకుపోయిందని బయోమైనింగ్ ఏజెన్సీని ఏర్పాటు చేసి త్వరలో చెత్తను తొలగిస్తామన్నారు. నిధులు కేటాయించి డంపింగ్ యార్డ్ చుట్టూ ప్రహరీ నిర్మిస్తామని తెలిపారు. రైతులు వెళ్లేందుకు డంపింగ్ యార్డ్ బయట రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామస్తుల నుంచి స్వయంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉంటే తక్షణమే డంపింగ్ యార్డ్‌ను మూసివేయాలని గ్రామస్తులు కోరారు. అధికారుల,ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన మాటలతో గ్రామస్తులు ఏకీభవించకపోవడంతో వారికి ఎమ్మెల్యే నచ్చచెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ కిషోర్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ సంతోష్ కిరణ్, ఎంపీడీఓ జగదీష్, రాణిజాన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ ఉత్సవాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రామగిరి(నల్లగొండ): బ్రహ్మంగారి గుట్టపై కొలువైన నీలగిరి క్షేత్ర శ్రీ పార్వతీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం నుంచి ఐదు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠ, ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు పెండోట బాల బ్రహ్మాణాచారి, గౌరవ అధ్యక్షుడు కంది సూర్యనారాయణ తెలిపారు. శనివారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో ప్రతిష్ఠ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 23న పార్వతీ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఊరేగింపు, 24న లక్షదీపారాధన కుంకుమ పూజ గాయత్రీ హోమం, 25న విగ్నేశ్వర పూజ పుణ్యాహవాచకం అఖండ దీపారాధన, అంకురారోహణం, 26న చండీ రుద్ర గణపతి హవణములు, మంగళహారతి మంత్రపుష్పం, స్వామి అమ్మవారికి నవగ్రహాలకు పుష్పాదివాసం, 27న యంత్ర ప్రతిష్ఠలు, కాశీ విశ్వేశ్వర స్వామి ధ్వజస్తంభ పున ప్రతిష్ఠ పార్వతీదేవి రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ, నవగ్రహాల ప్రతిష్ఠ వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ పున ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమానికి మంత్రి జగదీశ్‌రెడ్డి ,శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి ఎంపీలు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు అధికారులు కౌన్సిలర్లు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి రమేష్ నేత, సెక్రటరీ ఏనుగు నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పకీర్ వెంకటరెడ్డి, కొత్తపెల్లి రాములు వైద్యుల సత్యనారాయణ, కాశమ్మ ఆవుల కోటి పోలోజు శ్రీనివాస చారి శివ పాల్గొన్నారు

నూనె గింజల పంటలు పండించేలా ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు : నూనె గింజల పంటలు పండించే విధంగా రైతులకు సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహించాలని రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. వంట నూనెల ఉత్పత్తులపై హైదరాబాద్‌లో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. భారత దేశం ప్రతియేటా విదేశాల నుంచి లక్ష కోట్ల రూపాయల విలువైన వంట నూనెలను దిగుమతి చేసుకుంటోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులు భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యపై దృష్టి సారించాలని కోరారు. విదేశాల నుంచి వంట నూనెల దిగుమతికి వెచ్చిస్తున్న లక్ష కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని నిరోధించాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు పట్నాయక్, మాథూర్, వి.కె.సింగ్, అరవింద్‌కుమార్, సుబ్బారెడ్డి, దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం


పేరాల సత్తిరెడ్డి (ఫైల్)

రామన్నపేట : వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండలంలోని కొత్తగూడెం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రామన్నపేట ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడెం గ్రామానికి చెందిన సత్తిరెడ్డి ఈనెల 19న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని మేనల్లుడు మంగళపల్లి కొండల్ రెడ్డి శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీనివాసపురంలో..

హుజూర్‌నగర్‌రూరల్ : ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండలంలోని శ్రీనివాసపురంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ కట్టా వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసపురం గ్రామానికి చెందిన దగ్గుపాటి నరేష్(30) మేళ్లచెర్వులోని మైహోం సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. కాగా, గురువారం ఉదయం 7:30 గంటలకు భార్య మౌనికకు ఫ్యాక్టరీకి వెళుతున్నాని చెప్పి తన బైక్‌పై వెళ్లాడు. కాగా రెండు రోజులుగా భర్త ఇంటికి రాకపోవడంతో శనివారం అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇన్‌చార్జ్ ఎస్ఐపై సస్పెన్షన్ వేటు

నల్లగొండ క్రైం : అడవిదేవులపల్లి ఇన్‌చార్జ్ ఎస్ఐపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఎస్పీ రెమా రాజేశ్వరి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ అనుమతి లేకుండానే మిర్యాలగూడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ సత్యనారాయణ అడవిదేవులపల్లి ఇన్‌చార్జ్ ఎస్ఐగా రామ్మూర్తిని నియమించారు. దీనిపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. అదే విధంగా మిర్యాలగూడ డీఎస్పీ, సీఐలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫారసు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

ఆధారాలు చూపిస్తే వాహనాలు విడుదల చేస్తాం

జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో సీజ్ చేసిన వాహనాలను వాటి యజమానులు తగిన ఆధారాలు చూపిస్తే విడుదల చేస్తామని ఎస్పీ రెమా రాజేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎవరూ తగిన ఆధారాలు చూపకపోతే 6నెలల తర్వాత బహిరంగ వేలం వేస్తామని పేర్కొన్నారు. వివిధ కేసుల్లో ఉన్న 5 నాలుగు చక్రాల వాహనాలు, 96 బైక్‌లు, 17 ఆటోలు మొత్తం 118 వాహనాలు జిల్లా పోలీస్ కేంద్రానికి తీసుకొచ్చినట్లు తెలిపారు. పోలీసు కేసులు , ట్విట్టర్‌లో వివరాలు పొందుపర్చామని, వివరాల కోసం మోటర్ ట్రాన్స్‌పోర్టు అధికారి శ్రీను 949498805 నంబరును సంప్రదించాలని కోరారు.

సైన్స్ ఫెస్టివల్‌ను సందర్శించిన విద్యార్థులు

భువనగిరి : హైదరాబాద్‌లోని బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న ఇండియా సైన్స్ ఫెస్టివల్‌కు తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్‌వారి ఆహ్వానం మేరకు శనివారం భువనగిరి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 100 మంది తరలివెళ్లారు. ఈ ఫెస్టివల్‌లో విశ్వం పుట్టుక, అణువుల నిర్మాణం , రోబోటిక్, డ్రోన్స్, టెక్నాలజీ గురించి, సైబర్ సేఫ్టీ గురించి సైన్స్‌లో జరుగుతున్న పరిశోధనలు గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి భరణి కుమారి, ఉపాధ్యాయులు, ప్రభాకర్, సంధ్య, సలీం, వేణు, అనిత, ప్రతిభ, 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

నల్లగొండ రూరల్ : గ్రూప్-2 ఉచిత శిక్షణ పొందడానికి దరఖాస్తు గడువును పొడిగించినట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన అభ్యర్థులు ఈనెల 25లోపు స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో గానీ, నేరుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హత సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని వివరాల కోసం 08682-220007 సంప్రదించాలని పేర్కొన్నారు.

తాటిచెట్టుపై నరకయాతన


మల్లయ్యను కిందికి దించేందుకు యత్నిస్తున్న మరో కార్మికుడు

భువనగిరి : కాలు జారి తాటి చెట్టుపై ఇరుక్కుపోయి ఓ గీత కార్మికుడు నరకయాతన అనుభవించాడు. ఈ ఘటన మండలంలోని గౌస్‌నగర్‌లో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన గీత కార్మికుడు రాయిగిరి మల్లయ్య రోజు మాదిరిగా ఉదయం గ్రామ పరిధిలోని కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. పైనుంచి కిందికి దిగుతున్న క్రమంలో కాలు జారి తాటి చెట్టుపైనే ఇరుక్కుపోయాడు. స్థానికులు గమనించి గ్రామస్తులకు సమాచారం అందించారు. కొంత మంది గీత కార్మికులు తాటి చెట్టుపైన ఇరుక్కుపోయిన మల్లయ్యను తీసుకరావడం కోసం చేసిన ప్రయత్నం విఫలం అయ్యింది. దీంతో జేసీబీ సహాయంతో మల్లయ్యను కిందకు దించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరిపై కేసు

అనంతగిరి: సామాజిక మాధ్యమాల్లో స్థానిక ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌ను కించపరుస్తూ పోస్టులు పెట్టిన ఇద్దరిపై అనంతగిరి పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. అనంతగిరి ఎస్ఐ అయిలయ్య తెలిపిన వివరాల ప్రకారం..సామజిక మాధ్యమాల్లో స్థానిక ఎమ్మెల్యేను కించపరుస్తూ పోస్టులు పెట్టడంపై వెంకట్రాంపురం గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేవెళ్ల కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన ఫోన్ నంబర్లను గుర్తించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

మిర్యాలగూడ టౌన్ : జీవితంపై విరక్తితో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటనపై మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామానికి చెందిన కాసాని బుచ్చమ్మ(75) ఇటీవల అస్వస్థతకు గురైంది. వైద్యపరీక్షలు నిర్వహించే సమయంలో బాధను భరించలేకపోయింది. ఈ క్రమంలో శుక్రవారం కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లగానే కలుపు మందుతాగింది. విషయంను తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆపస్మారక స్థితిలో పడి ఉన్న బుచ్చమ్మను మిర్యాలగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

వరి సాగులో నీటి యాజమాన్య పద్ధతులే కీలకం

- అతిగా నీటిని అందిస్తే అనర్థమే
- వ్యవసాయాధికారి రాజగోపాలరావు



నడిగూడెం : పంటల సాగులో ఎక్కువ నీటిని వినియోగించేది వరి పంటకే. రబీ సాగులో అవసరానికన్నా ఎక్కువ నీటిని పొలాలకు అందించి రైతులు వరి పైరును రోగాలపాలు చేస్తున్నారు. ఎక్కువ నీరు వాడడం వల్ల దోమపోటు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రైతులు తెలిసీ తెలియక నీటిని వృథా చేస్తున్నారు. వరి సాగులో నీరు అధికమైతే ఈ ప్రభావం పంటపై చూపుతుంది. పైరుకు ఏ దశలో నీరు అవసరం ఉంటుందన్న విషయం రైతులు గుర్తించాలి. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నీటిని పొదుపు చేయడంతోపాటు అధిక దిగుబడి సాధించవచ్చు. వేసవి కాలంలో సాగు నీటికి పొదుపుగా వాడుకోవాలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు చెబుతున్నారు. వరి సాగులో నీటి యాజమాన్యంపై ఆయన చెబుతున్న సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే...


సాగులో ఉన్న వరి పైరు

60శాతం నీరు వరి సాగుకే..

వరి సాగులో నీరు ప్రధాన పాత్ర పోషిస్తోంది. వ్యవసాయ భూముల్లో వందశాతం నీటిలో 60శాతం నీటిని వరిసాగుకే వినియోగిస్తున్నాం. మొక్కలకు అతిగా నీటిని అందిస్తే అది అనర్థానికి దారి తీస్తుంది. ఎకరం వరికి పారించే నీటితో మూడు ఎకరాల మొక్కజొన్న సాగు చేసుకోవచ్చు. కిలో వరి ధాన్యం పండించడానికి 5వేల నుంచి 6వేల లీటర్ల నీటిని వాడుతున్నాం. అవసరాని కంటే రెండింతలు ఎక్కువగా వాడడమే కాకుండా నీటి వృథాకు కారణమవుతోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి మూడు, నాలుగు సంవత్సరాలకు ఒకసారి చెరువులు, కుంటలు, జలాశయాలు నిండినప్పుడే వరి సాగుకు అవకాశం ఉంటోంది. మామూలు సమయాల్లో వరి సాగుకు చాలా కష్టం. పంట కాలంలో ఏ దశలో ఎంత నీరు పెట్టాలో తెలుసుకొని దానికి అనుగుణంగా సాగు చేస్తే నీటి ఆదాతో పాటు రసాయనిక ఎరువులు సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. వరి సాగులో ముఖ్యంగా పంట కాలమంతా నీరు నిలువ ఉంచాలి.

నీటి ఆవశ్యకత ఇలా..

పంట కాలమంతా నీటి ఆవశ్యకత ఒకేలా ఉండదు. పైరు పెరుగుదలకు అనుగుణంగా మారుతుంది. పైరుకు 2-3 సెం.మీ లోతుకన్నా ఎక్కువ నీరు అవసరం ఉండదు. ఇంతకు మించి నీరందిస్తే పంటకు చీడ, పీడలు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పైరుకు వేసిన ఎరువులు వృథా అవుతాయి.

పంట నీరు.. పరిమాణం

- ఎకరం వరి పంటకు సాగుకు 1200 మి.మీ. నీరు అవసరం ఉంటుంది.
- నాట్లు వేసే సమయంలో పొలంలో 2-3 సెం.మీ మేరకు నీరు ఉంచాలి.
- నాట్లు వేసిన తర్వాత 5-20 రోజుల మధ్య కాలంలో 4-5 సెంమీ. నీరు ఉండాలి. దీని వల్ల మొక్కలు ప్రధాన పొలంలో ఉన్న పరిస్థితులను తట్టుకుని నిలదొక్కుకుంటాయి. దీని తర్వాత నీటిని తీసివేసి పల్చగా నీరు పెట్టాలి. కొత్త ఆకులు వచ్చి, చేను పల్చపడే వరకు 2 సెం.మీ. నీటికన్నా ఎక్కువ ఉండకుండా చూసుకోవాలి.
- పిలక దశలో నీటి ఎద్దడి రాకుండా 30శాతం వరకు పంట దిగుబడి తగ్గుతుంది. పిలక దశలో నీరు ఎక్కువగా ఉన్నట్లయితే పైరు దుబ్బు చేయదు.
- వెన్ను పొట్టదశ అంకురార్పణ దశ నుంచి 21 రోజుల వరకు పొలంలో ఎప్పుడూ 5 సెం.మీ. నీరు ఉండాలి. తర్వాత గింజ గట్టిపడే దశలో నేలలో తేమ ఉంటే సరిపోతుంది.
- వెన్ను పసుపు రంగు మారేదశ వచ్చినప్పటి నుంచి నీరు పెట్టాల్సిన పనిలేదు. నారు మడికి 50-60 మి.మీ. 51 శాతం ప్రధాన పొలం తయారు చేసేందుకు 202-250 మి.మీ. 20 శాతం వరి నాట్లు నుంచి వెన్ను ఏర్పడే వరకు 400-450 మి.మీ. పూతదశ నుంచి పక్వానికి వచ్చే వరకు 100 నుంచి, 150 మి.మీ నీరు పంటకు అవసరం.